క్లుప్తంగా

స్పెషల్ బ్రాంచి డీఎస్పీగా రామకృష్ణ



రాజమహేంద్రవరం రూరల్: జిల్లా స్పెషల్ బ్రాంచి డీఎస్పీగా బి.రామకృష్ణను నియమిస్తూ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం డీఎస్పీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. గత జూలైలో జరిగిన డీఎస్పీల బదిలీల్లో ఎస్బీ డీఎస్పీగా పనిచేసిన డి.ప్రభాకరరావు చిత్తూరు జిల్లా పలమనేరు డీఎస్పీగా బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఎస్బీ డీఎస్పీ పోస్టు ఖాళీగా ఉండడంతో బి.రామకృష్ణను నియమించారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శనివారం నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ శుక్రవారం ప్రకటించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కలిగే అంతరాయంతో జేఎన్ రోడ్, ఓఎన్జీసీ బేస్ కాంప్లెక్స్, చెరుకూరి ఫంక్షన్ హాల్, సూర్య ఫంక్షన్ హాల్, శ్రీవెంకటేశ్వర నగర్, హ్యాపీ స్ట్రీట్, మహాలక్ష్మి వీధి పరిసర ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందన్నారు.

జీహెచ్ఆర్ఏ జిల్లా చైర్మన్‌గా శ్రీనివాస్

ప్రకాశం నగర్: గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్‌నెస్ అసోసియేషన్ (జీహెచ్ఆర్ఏ) జిల్లా అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్ ఎన్నికైనట్లు శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో సంఘ జాతీయ చైర్మన్ కోనయ్య, ప్రధాన కార్యదర్శి సురేష్, రాష్ట్ర చైర్మన్ గణేష్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నానని అన్నారు.

ఆక్రమణల తొలగింపు

రాజమహేంద్రవరం సిటీ: నగర ప్రధాన రహదారిలో ఆక్రమణలను అధికారులు శుక్రవారం తొలగించారు. నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు జేసీబీల సహాయంతో ఆక్రమణలు తొలగించే పనులు చేపట్టారు. స్థానిక కోటగుమ్మం సెంటర్ నుంచి డీలక్స్ సెంటర్ వరకూ మొత్తం కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించారు.

ఇసుక అక్రమ నిల్వల సీజ్



ఇసుకను సీజ్ చేయిస్తున్న ఆర్డీఓ కృష్ణనాయక్ తదితరులు

సీటీఆర్ఐ: స్థానిక కోటిలింగాల రేవు ర్యాంపునకు సమీపంలో అనధికారంగా ఇసుక డంప్ చేసినట్లు గుర్తించి సీజ్ చేశామని ఆర్డీఓ కృష్ణనాయక్ తెలిపారు. శుక్రవారం సాధారణ తనిఖీల్లో భాగంగా కోటిలింగాల ర్యాంపునకు సమీపంలో ఎటువంటి అనుమతులు లేని, సుమారు రెండు లారీల ఇసుకను, జేసీబీలను గుర్తించారు. ఇసుకను, జేసీబీని సీజ్ చేసి కేసు నమోదు చేయాలని త్రీ టౌన్ సీఐకి సూచించారు. ఇసుక అక్రమంగా నిల్వ చేసిన ఆ ప్రాంత యజమానులకు కూడా నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మైన్స్ అధికారి డి.ఫణి కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

ప్రకాశం నగర్: అంతర్ జిల్లాల స్కూల్స్ బాయ్స్ ఫెడరేషన్ (ఎస్‌బీఎఫ్) 68వ బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 9, 10వ తేదీల్లో స్థానిక ఎస్‌కేవీటీ గవర్నమెంట్ కళాశాలలో నిర్వహించనున్నట్లు డీఈఓ కె.వాసుదేవరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అండర్- 17 బాలుర విభాగంలో నిర్వహించే ఈ పోటీల్లో 13 జిల్లాల నుంచి 13 బృందాలు పాల్గొనున్నాయన్నారు.

ట్రాక్టర్ బోల్తా: డ్రైవర్ మృతి

కడియం: కడియపులంక పంచాయతీ పరిధిలో గోదావరి గట్టుపై బూరుగుచెట్టు వుంత రోడ్డులో ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. రాజానగరం మండలం తోకాడ గ్రామానికి చెందిన ఎస్.వీరరామకృష్ణ (20) ట్రాక్టర్‌పై మొక్కలలోడు వేసుకుని గోదావరి గట్టుపై నుంచి వుంతరోడ్డులోకి దిగేందుకు ప్రయత్నించాడు. అయితే ప్రమాదశాత్తు ట్రాక్టర్ ఇంజిన్ బోల్తా పడింది. దాని కింద వీరరామకృష్ణ ఇరుక్కుపోవడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

నల్లపూసల తాడు చోరీ

రాజమహేంద్రవరం రూరల్: ఇంట్లో ఉన్న బంగారు నల్లపూసల తాడు చోరీకి గురైందని జాంపేట ఆశపువీధికి చెందిన వి.మంగతాయారు శుక్రవారం త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మంగతాయారు భర్త కోటేశ్వరరావు పండ్ల దుకాణం నిర్వహిస్తున్నారు. గత నెల 20న ఇంటి వద్ద షెడ్డు వేయడానికి సత్యనారాయణ, మరో ముగ్గురు ఇంటికి వచ్చి పని చేసి వెళ్లిపోయారు. 21న ఇంట్లో పెట్టిన రెండున్నర కాసుల బంగారు నల్లపూసలతాడు కనిపించడం లేదని, దాని విలువ రూ.50 వేలు ఉంటుందని మంగతాయారు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ముంచెత్త పోస్తున్నారు..!

- హండ్రెడ్ ఫీట్ రోడ్డులో సమస్య
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- స్పందించని నగరపాలక సంస్థ యంత్రాంగం

రాజమహేంద్రవరం రూరల్ : చూడ్డానికి రోడ్డు ఎంతో విశాలంగా ఉంటోంది.. రయ్ రయ్ అంటూ బండి ముందుకెళ్తోంది.. ఇక్కడో చిక్కు ఉందండోయ్.. ఆ రోడ్డును మొత్తం చెత్త ఆవరించేసింది.. అయినా నగరపాలక సంస్థ యంత్రాంగం మొద్దు నిద్ర వీడడం లేదు.. కనీసం పట్టించుకోవడం లేదు.. జాతీయ రహదారి నుంచి రాజమహేంద్రవరం ఆవ వాంబే కాలనీకి వచ్చే హండ్రెడ్ ఫీట్ రోడ్డులో చెత్త సమస్య ఇది. స్వయంగా జిల్లా కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్థానికులు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. దీనిపై అధికారులు స్పందన లేకపోవడం శోచనీయం. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ రాజమహేంద్రవరం నగర, పరిసర ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం పిడింగొయ్యి జాతీయ రహదారి నుంచి ఆవ వాంబే కాలనీ వరకూ హండ్రెడ్ ఫీట్ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో పాటు సెంట్రల్ డివైడర్లలో మొక్కలతో పాటు వీధి దీపాలను సైతం ఏర్పాటు చేయించారు. అయితే హండ్రెడ్ ఫీట్ రోడ్డులో ఒకవైపు భారీగా చెత్తను గుర్తు తెలియని వ్యక్తులు డంప్ చేసేస్తున్నారు. దీని వల్ల ఆ ప్రాంతం నుంచి వెళ్లేవారికి దుర్వాసన వస్తోంది. పలువురు వ్యర్థాలను తీసుకువచ్చి రోడ్డు పక్కన పడేయడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. దీనివల్ల ఎటువంటి వ్యాధులు ముంచుకొస్తాయోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మరోవైపు బ్యాటరీలు, పాత టైర్లలో ఇనుము కోసం రాత్రి సమయాల్లో వ్యర్థాలకు మంట పెట్టడంతో కాలుష్య సమస్య వస్తోంది.



హండ్రెడ్ ఫీట్ రోడ్డులో చెత్త



వ్యర్థాలకు నిప్పెట్టిన దృశ్యం

పొగ.. ఇబ్బందేగా..

ఇక్కడ చెత్తకు మంట పెట్టడంతో పొగ కారణంగా వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే సమీప ఇళ్లలో వారు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ చెత్త సమస్యపై స్వయంగా ఆవ వాంబే కాలనీ వాసులు జిల్లా కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. కానీ ఇప్పటి వరకూ ఎటువంటి పరిష్కారం లభించలేదు. రాత్రి సమయాల్లోనే డంపింగ్ చేయడంతో ఆ ప్రదేశంలో నైట్ వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలని అంతా కోరుతున్నారు. అలాగే చెత్త రోడ్డుపైకి వస్తుండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దుర్వాసనకు అటుగా వెళ్లలేకపోతున్నామని అంటున్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని నగరపాలక సంస్థ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆవ వాంబే కాలనీ వాసులు, వాహనచోదకులు కోరుతున్నారు.

సమస్య పరిష్కరించాలి



హండ్రెడ్ ఫీట్ రోడ్డులో చెత్త సమస్యను పూర్తిగా పరిష్కరించాలి. ఇక్కడ రాత్రి సమయాల్లో చెత్తను డంపింగ్ చేస్తున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నాం. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై నగరపాలక సంస్థ అధికారులు స్పందించి చెత్త సమస్యను పరిష్కరించాలి.

–సబ్బెళ్ల విజయదుర్గారెడ్డి, ఆవ వాంబే కాలనీ, రాజమహేంద్రవరం

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): 104 ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ పీవీవీ జయసూర్యకుమార్, ఎంపీడీఓ డి.శ్రీనివాసరావులను ఏపీ 104 ఏఎంయూ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు కోరారు. శుక్రవారం సాయంత్రం బొమ్మూరులోని రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు, హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. మూడు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్లు, డీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించి జీఓ నంబరు 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. తమ డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ధవళేశ్వరం 104 ఎంఎంయూ డ్రైవర్లు ప్రకాష్, సురేష్, కుమార్, అప్పారావు, డీఈఓలు చందు, సుందర్, దుర్గా భవాని తదితరులు పాల్గొన్నారు.

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నేరం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నేరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అమలుచేసే గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం (పీసీపీఎన్‌డీటీ యాక్ట్) అమలుకు సంబంధించి జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం జిల్లాలో ఉన్న ప్రతి స్కాన్ సెంటర్‌ను నిర్వహించే విధంగా వైద్య ఆరోగ్య శాఖ తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆడైనా మగైనా ఒకటే అనే విషయాన్ని ప్రజలంతా గుర్తించేలా అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులకు స్కాన్ మెషీన్ ద్వారా గర్భంలో బిడ్డ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికే తప్ప.. ఆడ, మగ అని తెలుసుకోవడానికి కాదని అవగాహన కల్పించాలన్నారు. ఏ స్కానింగ్ సెంటర్లోనైనా లింగ నిర్ధారణ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆడపిల్లల ప్రాముఖ్యతను ప్రజలందరికీ తెలియజేయాలని ఆదేశించారు. మూడు నెలల నుంచి ఇప్పటి వరకు 4 డెకోయ్ ఆపరేషన్లు, 42 స్కానింగ్ సెంటర్ల ఆకస్మిక తనిఖీలు రాజమహేంద్రవరం, కొవ్వూరు అడిషనల్ డీఎంహెచ్‌వోలు నిర్వహించారన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డ్రగ్స్ కంట్రోల్ అడిషనల్ డైరెక్టర్ నాగమణి, జిల్లా స్త్రీశిశు సంక్షేమ సాధికారిత అధికారి కె.విజయకుమారి, డీసీహెచ్ఎస్ పద్మశ్రీ రాణి, పోలీస్ శాఖ అధికారి కనకరాజు, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై అమీనా బేగం పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ రాజ్‌కుమార్, ఫస్ట్ అసిస్టెంట్ సూరిబాబు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నెల్లూరులో ఇటీవల జరిగిన 68వ స్కూల్ గేమ్స్ యోగా రాష్ట్ర స్థాయి పోటీల్లో స్థానిక శ్రీనివాసరామానుజన్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థి సంజయ్‌కుమార్ అండర్-14 విభాగంలో ట్రెడిషనల్‌లో గోల్డ్‌మెడల్ సాధించాడు. జాతీయ స్థాయిలో డిసెంబర్‌లో తమిళనాడు రాష్ట్రం కొయంబత్తూరులో జరిగే స్కూల్ గేమ్స్ యోగా పోటీలకు ఎంపికయ్యాడు. అదేవిధంగా 5వ జాతీయ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ 2024–25 అసోంలో నవంబర్ 11 నుంచి 14 వరకూ జరిగే పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థి టి.అఖిల రత్నాకర్ ఫస్ట్ పేరా జాతీయ స్థాయి యోగాసనా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ 2024–25 డిసెంబర్ 1 నుంచి 3 వరకు ఘజియాబాద్ జరిగే పోటీలకు ఎంపికయ్యాడు. 68వ రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో అండర్-14 విభాగంలో ఎం.భవిత ట్రెడిషనల్ గ్రూపు ద్వితీయ స్థానాన్ని, అండర్-17 విభాగంలో ఆర్టిస్ట్ పి.దయానా తనుశ్రీ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. ఎం.సంజయ్ కుమార్ ట్రెడిషనల్ సెకండ్ బెస్ట్‌గా, ఆర్టిస్ట్ సెకండ్ బెస్ట్‌గా నిలిచాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, వీరికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్, యోగా కోచ్ జె.రాజ్ కుమార్‌ను డీఈఓ కె.వాసుదేవరావు, ఏడీ నాగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ స్వామి, హెచ్ఎం పీకేఎస్ సత్యవతి, ఫస్ట్ అసిస్టెంట్ సూరిబాబు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

చెలరేగిపోతున్న ఇసుక మాఫియా

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

ప్రకాశం నగర్: ఉచితం పేరుతో ఇసుక మాఫియా చెలరేగిపోతుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ఆరోపించారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జిల్లా సమితి సమావేశం జరిగింది. దీనికి వనజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇసుక మాఫియాకు వ్యతిరేకంగా ఈ నెల 11న రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు. జార్ఖండ్‌లోని ఏకరూప పౌర స్మృతి (యూసీసీ) నుంచి గిరిజనులను ఎందుకు మినహాయించారో కేంద్రమంత్రి అమిత్‌షా సమాధానమివ్వాలని అన్నారు. గిరిజనుల హక్కులు, ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు. యూసీసీని అమలు చేసే బీజేపీ గిరిజనుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కష్టజీవుల రాజ్యస్థాపన కోసం సీపీఐ శ్రేణులు పనిచేయాలన్నారు. సీపీఐ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని వాడవాడలా సంబరాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, నాయకులు వి.కొండలరావు, జ్యోతిరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 1న బాలల కథా రచన పోటీలు

ప్రకాశంనగర్: బాల మందిరం, గోదావరి బాలోత్సవం సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి బాలల కథా రచన పోటీలు డిసెంబర్ 1వ తేదీన జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ పోటీలకు సంబంధించిన గోడపత్రికలు, కరపత్రాలను బాలోత్సవం అసోసియేట్ అధ్యక్షుడు వీఎస్ఎస్ కృష్ణకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.తులసి, బాల మందిరం వ్యవస్థాపకుడు అంగర గోపాలకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 4 నుంచి 10వ తరగతి వరకు చదివే వారందరూ ఈ పోటీల్లో పాల్గొనడానికి అర్హులని, ఈనెల 25వ తేదీ వరకూ 99631 63136, 94922 49377 నంబర్ల ద్వారా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. 80 కథలను బాలల కథా సంపుటి–2025 పేరుతో ఒక పుస్తక రూపంలో ముద్రించి జనవరిలో ఆవిష్కరించాలని ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కార్యాలయ పరిపాలనాధికారికి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ నేతలు

రాజమహేంద్రవరం రూరల్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. వీరు స్థానిక మోరంపూడిలోని రాజమహేంద్రవరం ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి కొండలరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహారావు మాట్లాడుతూ ఇప్పటి వరకూ 2015 తరువాత రిటైరైన ఉద్యోగులకు డిమాండ్ నోటీసు ఇచ్చి, ఆ ఉద్యోగితో రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ కట్టించుకుని రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకూ కొత్త పెన్షన్ ఇచ్చామన్నారు. ఈపీఎఫ్ అధికారులు కట్టించుకున్న సొమ్మును కట్టిన ఉద్యోగికి తిరిగి పంపించడం జరుగుతూ వస్తుందన్నారు. ఇటీవల కేంద్రప్రభుత్వం ఈపీఎఫ్ కమిషనర్లకు రిటైర్ అవుతున్న ఉద్యోగుల నుంచి ఎటువంటి సొమ్ము కట్టించుకోవద్దని ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీనివల్ల విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీనిపై పునరాలోచించి న్యాయం చేయాలని ఈపీఎఫ్ కార్యాలయంలోని పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో అసోసియేషన్ నాయకులు ఎంవీ కుమార్, బాబు, రాజమహేంద్రవరం డిపో ప్రెసిడెంట్ ఎస్.సతీష్, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నర్సరీ రంగ సమస్యలు పరిష్కరించండి



మంత్రి అచ్చెన్నాయుడికి వినతి పత్రం ఇస్తున్న మల్లు పోలరాజు తదితరులు

కడియం: కడియం ప్రాంత నర్సరీ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరపు అచ్చెన్నాయుడికి రైతులు వినతిపత్రం అందజేశారు. సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు విజయవాడలోని మంత్రి కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. నర్సరీ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నర్సరీ ఉపకరణాలు ట్రాలీలు, స్ప్రేయర్లు, షేడ్ నెట్లు, వీడ్ మేట్లు, పాలి హౌస్‌లు రాయితీపై ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సోలార్ మోటార్లను రాయితీలో ఇచ్చి కడియం నర్సరీ రంగాన్ని సోలార్ హబ్‌గా తీర్చిదిద్దారని మంత్రికి వివరించారు. రైతులు బ్యాంకుల వద్ద తీసుకునే రుణాల ప్రాసెసింగ్, రెన్యువల్ చార్జీలు చాలా అధికంగా పడుతున్నాయని, వేరే ఏ రంగానికి లేని విధంగా నర్సరీ రైతుల రుణాలపై ఈ అధిక చార్జీలు వల్ల రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి జంగా సుబ్బారావు, డైరెక్టర్లు తడాల నాగేశ్వరరావు, గాజుల రత్తయ్య, పిల్లా శ్రీనివాస్, మల్లు శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి



వరల్డ్ టౌన్ ప్లానింగ్ డేలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం నగరాన్ని విశాలంగా, సుందరంగా తీర్చిదిద్దడానికి టౌన్ ప్లానింగ్ విభాగం కీలకంగా వ్యవహరించాలని మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ పిలుపునిచ్చారు. వరల్డ్ టౌన్ ప్లానింగ్ డేను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేతన్ గార్గ్ మాట్లాడుతూ అధికారులు, లైసెన్స్ సర్వేయర్లు, ఇంజినీర్లు, బిల్డర్లకు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ ప్రణాళికా ఆవశ్యకత, రాజమహేంద్రవరం అర్బన్ డెవలమెంట్ ఆథారిటీ నగరపాలక సంస్థ సహకారంతో మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నారని చెప్పారు. చారిత్రాత్మక నగర గత వైభవం, ప్రస్తుత భవిష్య ప్రణాళికల వివరాలతో టౌన్‌ప్లానింగ్ మ్యూజియం ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. మేకా సత్యనారాయణమూర్తి (ఇంజినీర్), టి.శ్రీనివాస్ (ఆర్కిటెక్ట్), ఏఎస్‌వీ సత్యనారాయణ మూర్తి (లైసెన్స్ సర్వేయర్)లను సన్మానించారు. కార్యక్రమంలో జీవీఎస్ఎన్ మూర్తి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఎన్.శ్రీనివాస్, ప్లానింగ్ ఆఫీసర్ రుడా శ్రీనివాసమూర్తి, ఆర్‌డీడీటీపీ ఎం.పాండురంగారావు, ఎస్ఈ జి.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.



నృత్యాభినయం చేస్తున్న కళాకారిణిలు



మహిషాసుర మర్దిని నృత్యాభినయంలో కళాకారిణిలు

అదిరేలా.. అబ్బురపరిచేలా..

అలరించిన సంగీత, నృత్యోత్సవం

సీటీఆర్ఐ: నృత్యోత్సవం అలరించింది.. ప్రతి మదినీ ఉర్రూతలూగించింది.. అందెల రవమిది పదములదా అంటూ సాగిన చిన్నారుల పదనిసలు, నృత్య నీరాజనంతో గోదావరి తీరం సంగీత ప్రియులను ఓలలాడించింది. శ్రీ ఉమా నృత్య నికేతన్ ఆధ్వర్యంలో మంజీర పద నృత్యోత్సవం సప్తమ వార్షికోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరంలోని వేంకటేశ్వర ఆనంకళా కేంద్రంలో శుక్రవారం సాయంత్రం నుంచి ఆదివారం వరకూ మూడు రోజులు సంగీత, నృత్య నీరాజనం జరగనుంది. కార్తిక మాసోత్సవ వేళ నటరాజుకు సంగీత, నృత్య నీరాజనం అందించాలని శ్రీ ఉమా నృత్యనికేతన్ సంకల్పించింది. ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా వార్షికోత్సవం సందర్భంగా ఈ నీరాజనం ప్రారంభించింది. కూచిపూడి నాట్యాచారిణి రెడ్డి ఉమారాణి ఆధ్వర్యంలో మూడు రోజుల్లో 950 మంది కళాకారులు ఇందులో పాల్గొంటారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రిచే నర్తనశాల కూచిపూడి నృత్యరూపకం సంగీత ప్రియులను అలరించింది. అనంతరం గురువులకు సన్మానం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్ విచ్చేశారు. ఆయన్ని నృత్యనికేతన్ నిర్వాహకులు సన్మానించారు.



సర్టిఫికెట్లు తీసుకున్న నృత్యకళాకారిణిలు

తల్లిమందలించిందని అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: తన కుమారుడు ఆచూకీ తెలపాలని రాజమహేంద్రవరం ఆదెమ్మదిబ్బ వాంబేకాలనీకి చెందిన బోయిన వెంకటరమణ శుక్రవారం త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదెమ్మదిబ్బ వాంబే కాలనీకి చెందిన బోయిన సంతోష్ (20) డిగ్రీ చదివి ఖాళీగా ఇంట్లో ఉంటున్నాడు. గురువారం ఉదయం సంతోష్‌ను అతని తల్లి ఖాళీగా ఉండడమెందుకు ఏదోక పనిచేసుకోవచ్చు కదా అని అంది. దీంతో మధ్యాహ్నం నాలుగు గంటలకు ఇంటి నుంచి వెళ్లిన తన కుమారుడు తిరిగి రాలేదని వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక సోమాలమ్మ గుడి ప్రాంతంలో సారా విక్రయిస్తున్న కోరంగి చిన్నారావును వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై ఆదినారాయణ అరెస్టు చేశారు. అతని నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు.

సామాజిక కార్యకర్తపై కేసు

రాజమహేంద్రవరం రూరల్: సోషల్ మీడియాలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌పై, ప్రభుత్వాన్ని కించపరుస్తూ పోస్టులు పెడుతున్నారంటూ సామాజిక కార్యకర్త కేవీఆర్ రాజుపై శుక్రవారం జనసేన పార్టీ డివిజన్ ఇన్‌చార్జి అక్కిరెడ్డి వీరనాగేంద్రప్రసాద్ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.